క్లుప్తంగా

అభినందన

కర్నూలు(అగ్రికల్చర్): ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ ఆదోని తాలూకా యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికైన ఉషారాణి, బజారిలను ఉమ్మడి కర్నూలు జిల్లా నేతలు అభినందించారు.గురువారం ఆదోని తాలూకా సెక్రటరీ బజారి(పశుసంవర్ధకశాఖ) తదితరులు కలెక్టరేట్‌లోని జిల్లా ట్రెజరీ కార్యాలయంలో ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ అధ్యక్ష, కార్యదర్శులు వీసీహెచ్ వెంగళ్‌రెడ్డి, జవహర్‌లాల్, కర్నూలు నగర శాఖ అధ్యక్షుడు ఎంసీ కాశన్నలను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఆదోని తాలూకా అధ్యక్ష, కార్యదర్శులుగా పనిచేసే వారు పదవీ విరమణ చేయడంతో వారి స్థానంలో అధ్యక్ష,కార్యదర్శులుగా ఉషారాణి, బజారీ ఎన్నికయ్యారని వీసీహెచ్ వెంగళ్‌రెడ్డి తెలిపారు.

కమిషనర్‌ను కలిసిన ఎంపీ



కమిషనర్‌ను కలిసిన కర్నూలు ఎంపీ నాగరాజు

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ కమిషనర్ భార్గవ్‌తేజను గురువారం కర్నూలు పార్లమెంట్ సభ్యులు బస్తిపాటి నాగరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. తొలిసారిగా నగరపాలకకు వచ్చిన ఎంపీకి కమిషనర్ పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. నగరాభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని, నియోజకవర్గంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఎంపీ తెలిపారు. అనంతరం నగరంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల గురించి చర్చించారు.

నేటి నుంచి థిమాటిక్ ఎగ్జిబిషన్

కర్నూలు(అగ్రికల్చర్): స్థానిక కొండారెడ్డి బురుజు సమీపంలోని లేపాక్షి హ్యాండిక్రాఫ్ట్ ఎంపోరియం వద్ద గురువారం నుంచి ఈనెల 16వ తేదీ వరకు థిమాటిక్ ఎగ్జిబిషన్ నిర్వహించేందుకు ఏపీ హ్యాండ్‌క్రాఫ్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అనుమతి ఇచ్చిందని మేనేజర్ తిమ్మయ్య గురువారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ హస్తకళల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న థిమాటిక్ ఎగ్జిబిషన్‌లో కొండపల్లి బొమ్మలు, ఏటికొప్పాక బొమ్మలు, కలంకారి వస్తువులు, జ్యూట్ బ్యాగ్‌లు, హ్యాండ్‌మేడ్ గాజులు, వైట్ మెటల్ బొమ్మలు, రోజ్ ఉడ్ బొమ్మలు అందుబాటులో ఉంటాయన్నారు. 10 శాతం వరకు డిస్కౌంటు ఉంటుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

రేపటి నుంచి రాష్ట్ర స్థాయి ఈత పోటీలు

కర్నూలు కల్చరల్: కర్నూలు డిస్ట్రిక్ట్ ఆక్వాటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 13, 14 తేదీల్లో రాష్ట్ర స్థాయి ఈత పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి జి.రామకృష్ణ యాదవ్ పేర్కొన్నారు. గురువారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 9వ సబ్ జూనియర్, జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ ఆక్వాటిక్ ఛాంపియన్ షిప్ పోటీలు కిసాన్ ఘాట్ సమీపంలోని డీఎస్ఏ స్విమ్మింగ్‌పూల్‌లో నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. మొత్తం 90 ఈవెంట్లలో సుమారు 350 బాలబాలికలు పోటీ పడుతున్నారన్నారు. సమావేశంలో కోశాధికారి దస్తగిరి, జాయింట్ సెక్రటరీలు శివరాజ్, రామకృష్ణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి హజరతయ్య తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే నుంచి రక్షణ కల్పించండి

కర్నూలు(సెంట్రల్):కోడుమూరు మాజీ ఎమ్మెల్యే సుధాకర్, అతని అనుచరుల నుంచి తనకు, తన తల్లిదండ్రులకు రక్షణ కల్పించాలని లైంగిక బాధితురాలు కలెక్టర్ పి.రంజిత్ బాషాను కోరింది. గురువారం బాధిత బాలిక తల్లిదండ్రులతో కలిసి కలెక్టర్ పి.రంజిత్ బాషాను ఆయన చాంబరులో కలిసింది. తనపై జరిగిన లైంగిక దాడిపై ఇటీవల కేసు పెట్టడంతో మాజీ ఎమ్మెల్యేను పోలీసులు అరెస్టు చేశారని,దీంతో అతని అనుచరుల నుంచి తనకు, తన తల్లిదండ్రులకు ప్రాణహాని ఉందని వివరించారు. తన జీవితం నాశనమైన నేపథ్యంలో ప్రభుత్వం పునరావాసం కల్పించి ఆదుకోవాలని కలెక్టర్‌ను కోరింది.

☛ కోడుమూరు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ జే.సుధాకర్ చేతిలో లైంగిక దాడికి గురైన బాలికకు ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వాలని ఏపీ మహిళా సమాఖ్య నగర కార్యదర్శి ఆశాబేగం డిమాండ్ చేశారు. గురువారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు.

అడ్మిషన్లు ప్రారంభం



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఇన్‌స్టిట్యూట్ హెడ్ త్రిలోక్ చందర్, తదితరులు

కర్నూలు కల్చరల్: తిరుపతిలోని కలినరీ ఆర్ట్స్ ఇన్‌స్టిట్యూట్‌లో 2024–25 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ఇన్‌స్టిట్యూట్ హెడ్ త్రిలోక్ చందర్ తెలిపారు. గురువారం స్థానిక త్రిగుణ క్లార్క్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో అడ్మిషన్ల బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమావేశంలో త్రి గుణ క్లార్క్ ఇన్ జీమ్ బాబ్ కుమార్, ఫైనాన్స్ కంట్రోలర్ రమేష్, చీఫ్ ఇంజినీర్ దీపక్‌కుమార్, కిచెన్ ఇన్‌చార్జ్ సందీప్ కుమార్ పాల్గొన్నారు.

‘తల్లికి వందనం’..కుట్రకోణం!

- అమ్మఒడిని పేరు మార్చిన ప్రభుత్వం
- ఎంతమంది పిల్లలుంటే అంతమందికి పథకం వర్తింపజేస్తామని ఎన్డీఏ కూటమి హామీ
- తల్లికి రూ.15 వేలంటూ ఇటీవల జీఓ విడుదల
- ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు




టీడీపీ మేనిఫెస్టోలో ఒక్కో విద్యార్థికి రూ.15వేలు ఇస్తామని స్పష్టంగా పేర్కొన్న దృశ్యం

ఎన్నికల ముందు కూటమి హామీ: ఒకరుంటే ఒకరికి, ఇద్దరుంటే ఇద్దరికి, ముగ్గురుంటే ముగ్గురికి, నలుగురుంటే నలుగురికి తల్లికి వందనం కింద ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున తల్లి ఖాతాల్లో జమ చేస్తాం.

కూటమి ప్రభుత్వం: తల్లికి వందనం పథకంలో భాగంగా ప్రతి తల్లికి రూ.15 వేలు ఇస్తామంటూ ఇటీవల ప్రభుత్వం జీఓ విడుదల.

ఇక్కడే మోసం స్పష్టంగా కనిపిస్తోంది. గతంలో రైతులకు రుణమాఫీ, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తానని అధికారం చేపట్టిన చంద్రబాబు ఆ తర్వాత హామీలను గాలికొదిలేశారు. ఇప్పుడు కూడా అదే పంథాను అమలు చేస్తూ అమ్మలను మోసం చేస్తున్నారు.



Scheme	Description
TALLIKI VANDANAM	As a part of Government Assured Flagship Programs, the Government under "TALLIKI VANDANAM" scheme is providing financial assistance of Rs.15,000/- per annum to each mother or recognized guardian who is below poverty line household and sending their children to schools/colleges i.e., from Classes I to XII.
STUDENT KITS	Under Vidya Kanuka, the Government school students of Classes I to XII are provided with the following benefits: (i) Bilingual Textbooks (English content on one page and Telugu version on the opposite page) (ii) Notebooks and Workbooks (iii) Three pairs of Uniforms with stitching charges (iv) A pair of Shoes and two pairs of Socks (v) A Belt and a School Bag (vi) Pictorial dictionary, Oxford dictionary

ప్రభుత్వం జారీ చేసిన జీఓలో తల్లికి రూ.15వేలు మాత్రమేనని పేర్కొన్న దృశ్యం

కర్నూలు సిటీ: నియోజకవర్గంలో ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్, ప్రైవేట్ అన్–ఎయిడెడ్ స్కూల్స్, ఎయిడెడ్ స్కూల్స్ సుమారు 433 ఉన్నాయి. ఈ స్కూళ్లలో 75 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో 46 వేల మందికి గత ప్రభుత్వం అమ్మ ఒడి పథకం కింద రూ.235.84 కోట్లు వారి తల్లుల ఖాతాల్లో జమ చేసింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తల్లికి వందనం కింద ఎంత మంది పిల్లలుంటే అంత మందికి ఒక్కొక్కరికి రూ.15 వేలు జమ చేస్తామని ఎన్డీయే కూటమి హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇటీవల తల్లికి రూ.15 వేలు అని జీఓ విడుదల చేయడంతో పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. తల్లికి రూ.15 వేల చొప్పున కాకుండా విద్యార్థికి రూ.15 వేల చొప్పున ఎంత మంది విద్యార్థులుంటే అంతమందికి పథకాన్ని వర్తింపజేయాలని కోరుతున్నారు. ఒకపక్క ప్రైవేట్ స్కూళ్లలో ఫీజు కోసం యాజమాన్యాలు ఒత్తిడి చేస్తుండటం.. మరోపక్క తల్లికి వందనం డబ్బు జమ కాకపోవడంతో కొందరు విద్యార్థుల తల్లిదండ్రులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

ఫీజు భారమవుతోంది.



తల్లికి వందనం పథకం డబ్బు వస్తుందనే ఉద్దేశంతో నా కుమారుడు అర్జున్‌ను ఓ కార్పొరేట్ స్కూల్‌లో 1వ తరగతిలో చేర్పించాను. పాఠశాల యామజాన్యమేమో ఫీజు కట్టమని ఒత్తిడి చేస్తోంది. ఇక్కడేమో పథకం డబ్బు అందలేదు. దిక్కుతోచని స్థితిలో ఉన్నాం. ప్రభుత్వం త్వరగా పథకాన్ని అమలు చేసి రూ.15 వేలు ఇస్తే పాఠశాలలో ఫీజు కడతా. లేదంటే టీసీ తీసుకుని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాల్సి వస్తుంది.

– కొట్టం రాజశేఖర్, విద్యార్థి తండ్రి

డబ్బు జమకాలేదు



నాకు ఇద్దరు పిల్లలు, ఇందిరాగాంధీ మున్సిపల్ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్నారు. గత ప్రభుత్వం మా పాపకు మాత్రమే అమ్మ ఒడి పథకం డబ్బు ఇచ్చింది. అయితే చంద్రబాబు నాయుడు ఎన్నికల సమయంతో ఎంత మంది పిల్లలు చదువుకుంటే అంత మందికి తల్లికి వందనం డబ్బులిస్తామన్నారు. స్కూల్స్ ఓపెన్ చేసి నెల రోజులవుతోంది. ఇంత వరకు తల్లికి వందనం డబ్బు పడలేదు. తొందరగా ఇస్తే పిల్లల చదువులకు, అవసరాలు తీర్చుకునేందుకు అవకాశం ఉంటుంది.

– కాశపోగు లక్ష్మీదేవి, బిర్లాగడ్డ

ఇద్దరి పిల్లలకు ఇస్తారో ఇవ్వరో



ఏపీ ఎస్పీ బెటాలియన్ ఆవరణంలోని కట్టమంచి రామలింగారెడ్డి మున్సిపల్ హైస్కూల్‌లో మా ఇద్దరు పిల్లలు చదువుతున్నారు. తల్లికి వందనం కింద ఎంత మంది ఉంటే అంత మందికి రూ.15 వేల చొప్పున ఇస్తామన్నారు. ఇప్పుడేమో తల్లికి రూ.15 వేలు అంటున్నారంట. అది కూడా ఎప్పుడు ఇస్తారో తెలియదు. ఎన్నికల హామీ మేరకు ఎంతమంది పిల్లలుంటూ అంతమందికి ఇవ్వాలి.

– విజయ, కర్నూలు

పిల్లలకు మంచి భవిష్యత్ ఇవ్వండి



వివిధ పోటీల్లో నిలిచిన విజేతలతో వక్తలు

కర్నూలు (సిటీ): ఒకరు, ఇద్దరు పిల్లలకు మాత్రమే జన్మనిచ్చి వారికి మంచి భవిష్యత్ ఇవ్వాలని సెట్కూరు సీఈఓ పి.వి.రమణ, ఆర్థికశాస్త్ర అధ్యాపకులు నజీరుద్దీన్, అడ్వకేట్, పద్మలతా రెడ్డి సూచించారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా గురువారం యువజన సర్వీసుల శాఖ, సెట్కూరు ఆధ్వర్యంలో కేవీఆర్ మహిళా డిగ్రీ కాలేజీలో సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుటుంబంలో భార్య, భర్త, అన్నా, చెల్లెలు అందరూ భాగస్వాములై పనులు చేసుకుంటేనే జెండర్ ఈక్వాలిటీ సాధ్యమవుతుందన్నారు. భారత దేశ జనాభా ప్రస్తుతం 144 కోట్లు ఉంటుందని, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఏ దేశమైనా మనుగడ సాగించాలన్నా ఆ దేశంలో ఉండే యువ మానవ వనరులు అవసరమన్నారు. దేశంలో ఉన్న అత్యధిక శాతం మంది యువతపైనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందని, దేశం నైపుణ్యత కలిగిన యువత కొరతను ఎదుర్కొంటోందన్నారు. యువతకు ప్రస్తుతం ఏ రంగంలో అయితే ఎక్కువగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉంటాయో ఆ రంగంలో నైపుణ్య శిక్షణ ఇవ్వాలన్నారు. అనంతరం విద్యార్థులకు వకృత్వ, వ్యాసరచన, పోస్టర్ మేకింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కాలేజీ అధ్యాపకులు డి.పార్వతి, జి.రాధారమణి, సుబ్బరాజమ్మ, సెట్కూరు సూపరింటెండెంట్ రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ బిల్లులు విడుదల చేయండి



పీడీకి వినతి పత్రం అందిస్తున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లలిత

కర్నూలు(అర్బన్): అంగన్‌వాడీ కేంద్రాలకు గత ఏడాది డిసెంబర్ నుంచి వైఎస్సార్ సంపూర్ణ పోషణ బిల్లులు విడుదల కాకపోవడం వల్ల చాలా ఇబ్బందిగా ఉందని ఏపీ అంగన్ వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జే లలిత ఆందోళన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలకు గ్యాస్, ఆకుకూరలు, కూరగాయలు, పోపు దినుసులు బయటి మార్కెట్‌లో తెచ్చి నిర్వహించడం చాలా కష్టంగా ఉందన్నారు. గురువారం ఏఐటీయుసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ మునెప్పతో కలిసి ఆమె ఐసీడీఎస్ పీడీ పీ వెంకటలక్షుమ్మకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా లలిత మాట్లాడుతూ గత ఏడాది కర్నూలు జోన్ అంగన్ వాడీ సెంటర్ల వర్కర్స్, హెల్పర్ల ఖాళీలకు సంబంధించి ఇంటర్వ్యూలు నిర్వహించి, తాత్కాలికంగా ఆర్డర్లు ఆపారన్నారు. వెంటనే ఎంపికైన వారి జాబితాను ప్రకటించి ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఈ నేపథ్యంలో పీడీ స్పందిస్తు సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారన్నారు.

విద్యార్థి కిట్లను పక్కాగా అందించాలి



బీసీ బాలికల పాఠశాల పరిసరాలను పరిశీలిస్తున్న రాష్ట్ర పరిశీలకులు పెంచలయ్య

పాణ్యం: విద్యార్థి కిట్లను పక్కాగా అందించాలని విద్యాశాఖ రాష్ట్ర పరిశీలకులు పెంచలయ్య సూచించారు. గురువారం ఆయన నెరవాడ మెట్ట వద్ద ఉన్న బీసీ బాలికల పాఠశాల, గిరిజన గురుకుల బాలికల పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి కిట్ అందాలన్నారు. తాగునీరు, ఆహార పదార్థాలను పరిశీలించి విద్యార్థులకు అందించాలన్నారు. డయేరియా, ఇతర వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. అనంతరం తరగతి గదులు, మరుదొడ్లు, ల్యాబ్స్, డిజిటల్ క్లాస్ రూంలను పరిశీలించారు. ఆయన వెంట ఎంఈఓలు కోటయ్య, సుబ్రమణ్యం , ప్రిన్సిపాల్స్ ఫ్లోరమ్మ, మేరి సలోమీ ఉన్నారు.

పది నెలల్లో 550 కార్డియాక్ ప్రొసీజర్లు



కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించుకుంటున్న వైద్యులు

కర్నూలు (హాస్పిటల్): స్థానిక జెమ్‌కేర్ కామినేని హాస్పిటల్‌లో గత పది నెలల కాలంలో 550 కార్డియాక్ ప్రొసీజర్లు నిర్వహించినట్లు హాస్పిటల్ సీఈఓ డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం హాస్పిటల్‌లో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యాధునిక వసతులతో ఏర్పాటు చేసిన క్యాథ్‌ల్యాబ్ ద్వారా 24 గంటల పాటు హృద్రోగాలకు వైద్యులు సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో చీఫ్ కార్డియాలజిస్ట్ డాక్టర్ రాఘవేంద్ర, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్మోహన్ రెడ్డి, సీఓఓ డాక్టర్ గణేష్, జనరల్ మేనేజర్ నదీం పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): ప్లాస్టిక్ వాడకంతో కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు పోర్టు ముందుకు రావడం అభినందనీయమని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు పోర్టు ప్లాస్టిక్ వాడకంతో కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కోసం రూపొందించిన పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో చైర్మన్ దామోదర ప్రభాకర్ జోన్, సభ్యులు రామరాజు, రత్నప్రసాదు, రమణగౌడ్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

బాలిక అదృశ్యంపై నిగ్గు తేల్చండి



మాట్లాడుతున్న న్యాయవాది నాగభూషణంనాయుడు

కర్నూలు(అర్బన్): నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం ముచ్చుమర్రి గ్రామానికి చెందిన తొమ్మిదేళ్ల బాలిక అదృశ్యంపై నిగ్గు తేల్చాలని వాల్మీకి న్యాయవాదుల అసోసియేషన్ డిమాండ్ చేసింది. గురువారం జిల్లా బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు టి.నాగభూషణంనాయుడు అధ్యక్షతన ఏర్పాటు చేసిన వాల్మీకి న్యాయవాదుల సమావేశంలో న్యాయవాదులు బి.గోపాలకృష్ణుడు, ఎం.ప్రభాకర్, సి.ఆనంద్, బి.వీరేష్, ఎస్.పద్మజానాయుడు, చంద్రప్రభాకర్, బాలలక్ష్మయ్య బాలిక అదృశ్యమై మూడు రోజులైనా పోలీసులు ఆచూకీ కనుక్కోలేకపోవడం సిగ్గుచేటన్నారు. బాలిక అదృశ్యానికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు.

☛ బాలిక అదృశ్యానికి కారణమైన ముగ్గురు మైనర్లను కఠిన శిక్షించాలని వాల్మీకి యువసేన రాష్ట్ర అధ్యక్షులు వినోద్‌కుమార్ కోరారు. గురువారం యువసేన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నిందితులను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని, లేనియెడల ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు శేషశ్రీనివాసులు, సహాయ కార్యదర్శి సాయి కుమార్, భాస్కర్‌నాయుడు పాల్గొన్నారు.

☛ బాలిక అదృశ్యానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీసీ జేఏసీ కన్వీనర్లు దేవపూజ ధనుంజయ ఆచారి, బత్తుల లక్ష్మీకాంతయ్య డిమాండ్ చేశారు. గురువారం స్థానిక బీసీ భవన్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో నాయకులు అయ్యన్నయాదవ్, బోయ శ్రీనివాసులు నాయుడు, కృష్ణోజీరావు తదితరులు పాల్గొన్నారు.

జనాభా నియంత్రణకు సహకరించాలి



ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): జనాభా నియంత్రణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ కోరారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా బుధవారం డీఎంహెచ్ఓ కార్యాలయం నుంచి కర్నూలు మెడికల్ కాలేజీ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని డీఎంహెచ్ఓ డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా జులై 11న ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ఈ సంవత్సరం తల్లీబిడ్డ శ్రేయస్సు కోసం ‘సరైన సమయంలో గర్భధారణ, బిడ్డకు బిడ్డకు మధ్యఅంతరం’ నినాదంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించిన వారికి ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేస్తున్నట్లు తెలిపారు.

కు.ని పాటించిన లబ్ధిదారుల ఎంపిక

జిల్లాలో కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించిన లబ్ధిదారులను బహుమతుల కోసం జిల్లా కలెక్టర్ పి. రంజిత్‌బాషా తన ఛాంబర్‌లో లక్కీడిప్ ద్వారా ఎంపిక చేశారు. పీపీఐయూసీడీ విభాగంలో రంగమ్మ, అంతర ఇంజెక్షన్ విభాగంలో జానకీప్రియ, వేసక్టమీ విభాగంలో మురళీధర్‌రెడ్డిలను ఎంపిక చేశారు. కార్యక్రమంలో డీపీఎంఓ డాక్టర్ ఉమ, జిల్లా అంధత్వ నివారణాధికారి డాక్టర్ సంధ్యారెడ్డి, జిల్లా మలేరియా అధికారి నూకరాజు, న్యూక్లియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మల్లికార్జున్ రెడ్డి, డెమో శ్రీనివాసులుశెట్టి, ఎస్ఓ హేమసుందరం పాల్గొన్నారు.

– అధిక జనాభా కారణంగా అనేక నష్టాలు జరుగుతున్నాయని విశ్వభారతి మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ మునీరుద్దీన్ అహమ్మద్ తెలిపారు. విశ్వభారతి జనరల్ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ఆయన జనాభా పెరగడం వల్ల నష్టాలు, జనాభా నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో పీడియాట్రిక్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రావ్య, నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ అపరంజి కుమారి పాల్గొన్నారు.

– లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్, నైస్ స్వచ్ఛంద సేవా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవం పురస్కరించుకుని గురువారం జనాభా నియంత్రణపై అవగాహన, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు రాయపాటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక

బీ.జగన్ (ఇడుపులపాయ) కె.వంశీ (ఒంగోలు)

సి.బెళగల్: మండలంలో చదువుకున్న ఇద్దరు విద్యార్థులు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లకు ఎంపికయ్యారు. మండలం కేంద్రం సి.బెళగల్లోని బీసీ హాస్టల్లో ఉంటూ స్థానిక మోడల్ స్కూల్లో 10వ తరగతి చదివి పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో 569 మార్కులతో మండల టాపర్‌గా నిలిచిన గుండేవుల విద్యార్థి బీ.జగన్ ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌కు ఎంపికయ్యాడు. అదేవిధంగా గోనేగండ్ల మండలం అలువాల గ్రామానికి చెందిన బీసీ హాస్టల్ విద్యార్థి కె.వంశీ పదవ తరగతిలో 568 మార్కులతో మండల సెకండ్ టాపర్‌గా నిలిచి, ఒంగోలు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌కు ఎంపిక అయ్యాడు. ఎంపికైన విద్యార్థులను సి.బెళగల్ బీసీ హాస్టల్ వార్డెన్ రమేష్, హాస్టల్ సిబ్బంది అభినందించారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయించండి

సి.బెళగల్: గ్రామాలలోని హౌసింగ్ కాలనీలలో లబ్ధిదారులు నిర్మించుకుంటున్న ఇళ్లను వందరోజుల్లో పూర్తి చేయించాలని జిల్లా హౌసింగ్ పీడీ సిద్ధాలింగమూర్తి మండల అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన మండలంలో పర్యటించి హౌసింగ్ కాలనీలను తనిఖీ చేశారు. మండల అధికారులతో కలిసి మండల పరిధిలోని బురాన్‌దొడ్డి హౌసింగ్ కాలనీని తనిఖీ చేశారు. లబ్ధిదారులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ దశాలు పూర్తి అయిన వెంటనే బిల్లులు చెల్లింపు అయ్యేలా చూడాలని లబ్ధిదారులు కోరడంతో, పీడీ సానుకూలంగా స్పందించారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో హౌసింగ్ ఈఓఆర్డీ సందీప్, మండల హౌసింగ్ ఏఈ సుమంత్‌లతో కలిసి గ్రామ సచివాలయ ఇంజనీర్ అసిస్టెంట్లు, ఉపాధిహామి సిబ్బందితో గృహ నిర్మాణాలపై సమీక్ష సమావేశంను నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ, హౌసింగ్ కాలనీ లేఅవుట్లలో, లబ్ధిదారులు వారి సొంత స్థలాల్లో నిర్మించుకుంటున్న గృహ నిర్మాణాలు మూడు నెలలోగా పూర్తి అయ్యేలా చూడలని ఆదేశించారు. గృహ నిర్మాణాల్లో ఉపాధిహామీ పథకంలో భాగంగా చేపట్టిన పనిదినాలను వివరాలను నమోదు చెసి లబ్ధిదారులకు బిల్లుల వివరాలను ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని సూచించారు. సమావేశంలో ఉపాధిహామి ఏపీఓ లక్ష్మన్న, టీఏలు తదితరులు ఉన్నారు.

అంతర్‌రాష్ట్ర దొంగల అరెస్టు



అంతర్ రాష్ట్ర దొంగలను అరెస్టు చేసిన పోలీసులు

కర్నూలు (అర్బన్): తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు అంతర్‌రాష్ట్ర దొంగలను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి బంగారు నగలను స్వాధీనం చేసుకున్నట్లు కర్నూలు నాల్గవ పట్టణ పోలీసులు తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ 28న నగరంలోని గోపీనగర్, జూన్ 20న బాబా బృందావన్ నగర్‌లోని ఇళ్లల్లో వీరు దొంగతనాలకు పాల్పడ్డారు. కేసు నమోదుచేసుకున్న ఎస్ఐ పి.మోహన్ కిషోర్‌రెడ్డి, క్రైం పార్టీ సిబ్బంది గురువారం కందుల సత్యనారాయణ, కుందుర్తి రవికుమార్ అనే వ్యక్తులను అరెస్టు చేసి జత బంగారు బుట్ట కమ్మలు, గాజు, నల్లపూసల దండ, నెక్లెస్ డాలర్, చైను, బ్రాస్‌లైట్, రెండు ఉంగరాలు కలిపి మొత్తం 9.50 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే దొంగతనాలు చేసేందుకు ఉపయోగించిన ఒక పల్సర్ బైక్, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. దొంగిలించిన కొంత సొత్తును పిడుగురాళ్లలోని ముత్తూట్ ఫైనాన్స్‌లోని కుదువపెట్టిన సొమ్ముకు సంబంధించిన రసీదును కూడా స్వాధీనం చేసుకుని, నిందితులను రిమాండ్ నిమిత్తం కర్నూలు జేఎంఎఫ్‌సీ కోర్టులో హాజరుపరిచారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



కాలేజీలో పర్యటిస్తున్న కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు

కర్నూలు (సిటీ): అధ్యాపకులు చెప్పిన పాఠశాల శ్రద్ధగా చదువుకు బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు విద్యార్థినులకు సూచించారు. గురువారం కేవీఆర్ బాలికల జూనియర్ కాలేజీని సందర్శించారు. సౌకర్యాలు, బోధన తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్నామని ఏ ఒక్కరూ నామోషీగా భావించరాదన్నారు. ఈరోజు ఉన్నత స్థానాల్లో ఉన్న వారందరూ ఒకప్పుడు ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుకున్న వారేనన్నారు. తను ప్రభుత్వ స్కూళ్ల, ప్రభుత్వ కాలేజీల్లోనే చదువుకుని ఇప్పుడు ఎంపీ స్థాయికి ఎదిగానని గుర్తు చేశారు. గొప్ప లక్ష్యాలను నిర్దేశించుకుని ఆ దిశగా అడుగులేయాలన్నారు. ఎంపీ నిధులను వెచ్చించి కాలేజీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ లాలెప్ప ఉన్నారు.

సారా బట్టీల ధ్వంసం



నాటు సారా బట్టీని ధ్వంసం చేస్తున్న సెబ్ అధికారులు

కోడుమూరు రూరల్: వెల్దుర్తి మండలం ఎల్.బండ తండా గ్రామంపై సిబ్బందితో దాడులు నిర్వహించి రెండు చోట్ల నాటు సారా బట్టీలను ధ్వంసం చేసినట్లు సెబ్ సీఐ రామాంజనేయులు గురువారం తెలిపారు. రెండు చోట్ల నాటుసారా బట్టీల్లో సారా తయారీకి సిద్ధంగా ఉన్న 1,275 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేయడంతో పాటు, కేసులు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ తెలిపారు. దాడుల్లో సెబ్ సిబ్బంది హనుమంతు, విరూపాక్షి రెడ్డి, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.